సాక్షి నంద్యాల

మంగళవారం, 5, డిసెంబర్, 2023



1,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు సోమవారం 1,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 1,540 క్యూసెక్కులు వదులుతున్నారు. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. పురాతన మండపంలో వెయ్యి దీపాలను వెలిగించారు.



రేపు ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. వివరాలకు 9441509619 నంబర్‌ను సంప్రదించవచ్చు.

న్యూస్‌రీల్

మహానందీశ్వరుడి సేవలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి



ఆలయ ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు

మహానంది: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సోమవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్తీకమాసం, మూడవ సోమవారం సందర్భంగా నవనంది క్షేత్రాల సందర్శనలో భాగంగా మహానంది వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి, శ్రీ వినాయక నందీశ్వర స్వామి, గరుడనందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

సాయుధ దళాల సంక్షేమానికి విరాళాలు ఇవ్వండి



స్టిక్కర్స్ కార్ ఫ్లాగ్స్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: సాయుధ దళాల సిబ్బంది సంక్షేమానికి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు విరివిగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక్ బోర్డ్ చైర్మన్ మనజీర్ జిలానీ శామూన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన చాంబర్‌లో ఈనెల 7వ తేదీ సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని సాయుధ దళాల పతాక దినోత్సవ స్టిక్కర్స్, కార్ ఫ్లాగ్స్‌ను జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎస్ఆర్. రత్న రూతతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఏటా డిసెంబర్ 7న సాయుధ సైనిక జెండా దినోత్సవాన్ని జరుపుకుంటారని, ఆ రోజున, సాయుధ సిబ్బంది అభివృద్ధి కోసం భారతీయ జెండా స్టిక్కర్స్, కార్ ఫ్లాగ్స్‌ను, ఇతర వస్తువులను విక్రయించి నిధులు సేకరిస్తారన్నారు. ఇలా సేకరించిన నిధులను యుద్ధంలో మరణించిన వారి కుటుంబాల పునరావాసం కోసం కూడా ఉపయోగిస్తారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలకు పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్ర-2024కు దరఖాస్తులను ఆహ్వానిస్తూ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసినట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మక్కాలో హజ్, మదీనా యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి ఉన్న ముస్లింలు డిసెంబర్ 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు పాస్ పోర్టు జిరాక్స్ కాపీ, ఆధార్, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు-2, బ్యాంక్ అకౌంట్ కాపీలు జతచేయాలన్నారు. వివరాలకు 9440232564ను సంప్రదించాలన్నారు.

వణికిస్తున్న మిచాంగ్

- తుపాన్ ప్రభావంతో జిల్లాకు ఆరెంజ్ అలర్ట్
- భయపెడుతున్న ఈదురుగాలులు, వాన
- కోత దశలో వరి పంట
- ఆందోళనలో రైతులు
- అధికారుల హెచ్చరికతో అప్రమత్తం



కోవెలకుంట్ల సమీపంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు



తుపాన్ ప్రభావంతో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పిన దృశ్యం

కోవెలకుంట్ల: నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుపాన్ (మిచాంగ్) వరి రైతులను భయపెడుతోంది. జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాన్ ప్రభావంతో సోమవారం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఈదురు గాలులు, అక్కడక్కడా చిరు జల్లులు కురవడంతో దిగుబడులు తడవకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.76 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా 1.03 లక్షల ఎకరాల్లో కర్నూలు, నంద్యాల సోనా, 555 రకాలకు చెందిన వరి సాగు చేశారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 23,880 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా 11,713 ఎకరాల్లో సాగైంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు వెచ్చించారు. వాతావరణం అనుకూలించి వరిలో మంచి దిగుబడులు వస్తున్నాయి. ఎకరాకు 42 బస్తాల వరకు దిగుబడులు లభిస్తుండటంతో పెట్టుబడులు పోనూ నికర ఆదాయం చేకూరుతుందని రైతులు భావించారు. ఆయా మండలాల్లో 40 శాతం మేర కోత, నూర్పిడి పనులు పూర్తయ్యాయి. దిగుబడులను కల్లాలు, పొలాల్లో ఆరబోసుకున్నారు. ఇంకా 60 శాతం పంటలో కోత, నూర్పిడి పనులు చేపట్టాల్సి ఉంది. ఈ తరుణంలో తుపాన్ వెంటాడుతుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. భారీ వర్షం కురిస్తే పైరంతా నేలవాలి వడ్లు రాలిపోయే ప్రమాదం ఉందని దిగాలు చెందుతున్నారు. సోమవారం ఉదయం నుంచి ఆకాశంలో మార్పులు చోటు చేసుకుని అంతటా ముసురు కప్పుకుంది. చల్లని గాలులు వీచుతున్నాయి. తుపాన్ తీరం దాటే సమయంలో గాలుల తీవ్రత పెరిగి పంట నేలకూలే ప్రమాదం ఉండటంతో పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోత కోసి కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై పట్టాలు కప్పుతున్నారు. అధికారుల హెచ్చరికలతో కోత కోసి పొలాల్లో ఉన్న పంటను గట్టుకు చేర్చి పెద్ద పెద్ద టార్పాలిన్లతో కప్పేస్తున్నారు.

రబీ పంటలకు అనుకూలం

ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో 1.81 లక్షల హెక్టార్లలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం కాగా 76,677 హెక్టార్లలో రైతులు పప్పుశనగ, మినుము, పెసర, ధనియాలు, కొర్ర, ఆముదం, జొన్న తదితర పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధిక విస్తీర్ణంలో లక్ష హెక్టార్లలో శనగ పంట సాగైంది. విత్తనానికి ముందు, విత్తనం వేసిన తర్వాత ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురియలేదు. వివిధ పైర్లు రెండు నెలల పంటదశలో ఉన్నాయి. ఒక వర్షం వస్తే దిగుబడులు చేతికందుతాయని రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేయడంతో వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్ర వాయుగుండం తుపానుగా మారుతున్న దృష్ట్యా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. సోమవారం ఆయన చాంబర్‌లో తుపాన్ ప్రభావిత పరిస్థితుల అప్రమత్తతపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను ప్రభావిత కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రుద్రవరం, ఆళ్లగడ్డ తదితర ప్రభావిత మండలాల్లోని వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ రంగాలు, విద్యుత్ రవాణా, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, అగ్నిమాపక శాఖ, డీఎంహెచ్‌ఓ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్‌డీఓలు, తహసీల్దార్లు ఎప్పటికప్పుడు వర్షపాతం నమోదు వివరాలను తెలుసుకుంటూ సంబంధిత ప్రభావిత మండలాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ మేరకు నంద్యాల కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08514-294898, నంద్యాల ఆర్‌డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08514-221550, ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నెంబర్ 7815959529, డోన్ ఆర్‌డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నెంబర్ 7815959535లను సంప్రదించాలన్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాలు, పాత మిద్దెల్లో నివాసం ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండల అధికారులు, సచివాలయ సిబ్బంది స్థానిక కేంద్రంలో నివాసం ఉండి ఎప్పటికప్పుడు తుపాన్ ప్రమాదంపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

కాచిగూడ-చెంగల్‌పట్టు రైలు రద్దు

కర్నూలు(రాజ్‌విహార్): తుపాన్ కారణంగా కాచిగూడ నుంచి కర్నూలు మీదుగా చెంగల్‌పట్టు (తమిళనాడు)కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం (4వ తేదీ) రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు వైపులా తిరిగే 17651, 17652 రైళ్లను రద్దు చేశామని, ప్రయాణికులు గమనించి, సహకరించాలని కోరారు.



మిచాంగ్ తుపాను కారణంగా కోవెలకుంట్ల పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం చిరు జల్లులు కురిశాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం మారిపోయింది. - కోవెలకుంట్ల



వేటకు అంతరాయం మిచాంగ్ తుపాను కారణంగా చిరుజల్లులతో పాటు ఈదురు గాలులు వీస్తుండటంతో ప్రజలు పనుల మీద బయటకు రాలేకపోతున్నారు. పొలాల్లో పక్షులు సైతం చలికి తట్టుకోలేక.. ఇటు మేతకు వెళ్లలేక పొలాల్లో నిలిచిపోతున్నాయి. దొర్నిపాడు శివారులోని ఓ పొలంలో చలికి వణికిపోతూ నిలబడి పోయాయి. - దొర్నిపాడు

శ్రీశైల క్షేత్రం.. కార్తీక శోభితం



కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తులు



దీపారాధన చేస్తున్న దంపతులు

శ్రీశైలంటెంపుల్: పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో ముక్కంటి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం మూడవ సోమవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి బారులుదీరారు. ఉచిత దర్శన క్యూలైన్లు గంగాధర మండపం వరకు చేరుకున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజామున ఆలయ ద్వారాలను తెరిచి భక్తులను స్వామిఅమ్మవార్ల దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామిఅమ్మవార్ల అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం కల్పించారు. ఉచిత దర్శనానికి 6 గంటలు, శీఘ్ర దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర (శివ)మాఢవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మరి కొందరు నోములు నోచుకున్నారు. కాగా కార్తీకమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద జరగాల్సిన లక్షదీపోత్సవం, దశవిధ హారతులు తుపాను కారణంగా దేవస్థానం అధికారులు రద్దు చేశారు.

98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో డిసెంబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. పింఛన్ల పంపిణీ సోమవారం కూడా జరిగింది. సాయంత్రం 7గంటల వరకు నంద్యాల జిల్లాలో 98.16శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కూడా పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

క్వింటా ఎండు మిర్చి రూ.22 వేలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి మార్కెట్ యార్డులో ఎండు మిర్చి అమ్మకాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్-10 రకం సరకు అమ్మకాలు జరిగాయి. ఈ రకం జనరల్ గరిష్ఠ ధర క్వింటా రూ.22 వేలు, మధ్యస్థ ధర రూ.19 వేలు, కనిష్ఠ ధర రూ.17,500గా నమోదైంది. ఇదే రకం తాలు కాయ క్వింటా గరిష్ఠ ధర రూ.10,500, కనిష్ఠ ధర రూ.8,200 పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



బీటెక్ విద్యార్థిని అంజమ్మకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఎస్టీ కమిషన్‌చైర్మన్ డీజీవీ శంకరరావు

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీజీవీ శంకరరావు అన్నారు. సోమవారం ఉదయం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు వి.సోమశంకర నాయక్, కొర్రా రామలక్ష్మి, జరపరంగి సురేష్, మురళీదొర, ఎం. విశ్వేశ్వరరాజులు దర్శించుకున్నారు. అనంతరం ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఆ తర్వాత మేకలబండ చెంచుగిరిజన గూడెంలోని గిరిజనులతో వారు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ప్రకాశం జిల్లాలోని బయన్న స్వామిగూడెం, బోడేనాయక్ తాండ, మర్రిపాలెం, తుమ్మల బయలు, ఇష్టకామేశ్వరి, నెక్కంటి, వంటి గూడేలను సందర్శించారు. చెంచు గిరిజనులకు అవసరం అయిన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గిరిజనులతో చర్చించారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజనులకు ఎస్టీ కమిషనర్ చైర్మన్ డీజీవీ శంకర్‌రావు సూచించారు. అనంతరం అంకమ్మ చెంచు గూడెంకు చెందిన బీటెక్ విద్యార్థిని కురుముల అంజమ్మకు ల్యాప్‌టాప్‌ను అందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ డా.బి రవీంద్రారెడ్డి, డీటీడబ్ల్యూఓ జగన్నాథం, ఏపీడబ్ల్యూఓ హుస్సేనయ్య, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.లత, ఉద్యానవన ప్రాజెక్ట్ అధికారి ధనుంజయ, తహసీల్దార్ రాజేంద్రసింగ్, ప్రత్యేకాధికారి కేజీనాయక్, తదితరులు ఉన్నారు.

838.30 అడుగులుగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 838.30 అడుగులకు చేరుకుంది. సుంకేసుల జలాశయం నుంచి వచ్చే వరద ప్రవాహం రెండు రోజులు క్రితం నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఆదివారం నుంచి సోమవారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 3,451 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 950 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 59.2803 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అతివలే నిర్ణేతలు

- జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం
- వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నది వీరే

నంద్యాల: మహిళా లోకం తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల భవిత్యాన్ని నిర్ణయించే స్థాయిలో నిలిచారు. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ముందస్తు కసరత్తు చేస్తోంది. పోలింగ్ కేంద్రాల గుర్తింపుతో పాటు ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య ముసాయిదా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 6,68,475 మంది పురుష ఓటర్లు, మహిళా ఓటర్ల 6,89,252 మందితో పాటు 271మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారు. మొత్తం 13,57,998. మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలదే అగ్రస్థానం కావడం గమనార్హం. మొత్తం జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే పురుషుల కన్నా మహిళా ఓటర్లు 20,777 మంది అధికంగా ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఆళ్లగడ్డలో 2,137, శ్రీశైలం 3,430, నందికొట్కూరు 3,327, నంద్యాల 6,449, బనగానపల్లె 2,923, డోన్ 2,511 మహిళల ఓట్లు అధికంగా ఉన్నాయి.

శరవేగంగా ఓటరు జాబితా సవరణ

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ పక్కాగా చేపట్టారు. ఇంటింటికీ వెళ్లిన బృందాలు ఓటరు జాబితాను అనుసరించి ఓటర్లను గుర్తించారు. మండలాల వారీగా తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ల ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓ)లు ఇంటింటా సర్వే చేశారు. వీరితోపాటు అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా ఉన్నారు. ఇప్పుడున్న ఓట్లను గుర్తించడంతోపాటు కొత్త ఓటర్లను కూడా నమోదు చేశారు. అవసరమైన ఫారాలను కొత్తగా ఓట్లు నమోదు చేయించుకున్న వారితో పూర్తి చేయించారు.

- పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లను గుర్తించడంతో పాటు నాలుగు ప్రధాన అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని సర్వే చేపట్టారు. ఒక డోర్ నంబరులో పది ఓట్లు పైబడి ఉన్నవారిని, 80 నుంచి 100 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారిని, ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500కు పైబడి ఓటర్లు ఉన్న వారిని కూడా గుర్తించారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆళ్లగడ్డ	295	1,11,793	1,13,930	18	2,25,741
శ్రీశైలం	226	0,94,736	0,98,166	40	1,92,942
నందికొట్కూరు	251	1,05,196	1,08,523	12	2,13,731
నంద్యాల	281	1,28,078	1,34,527	91	2,62,696
బనగానపల్లె	277	1,17,924	1,20,847	32	2,38,803
డోన్	291	1,10,748	1,13,259	78	2,24,085
మొత్తం	1621	6,68,475	6,89,252	271	13,57,998




మహిళలు(ఫైల్)

ఓటు నమోదుకు మరో అవకాశం..

- జిల్లా యంత్రాంగం ఓటర్ల నమోదుకు మరోసారి అవకాశం కల్పించింది. డిసెంబర్ 3వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ జిల్లాలో కొనసాగుతుంది. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు. నమోదు చేసుకునే అవకాశం కల్పించింది.
- ఓటర్ల చేర్పులపై డిసెంబర్ 2, 3 తేదీల వరకు ఓటర్ల నమోదుపై ప్రత్యేక ప్రచారం రోజులుగా ప్రకటించారు. ఆ రోజుల్లో బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.
- కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తు విధానం (ఆఫ్ లైన్ ద్వారా)లో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్), అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (తహసీల్దార్), బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్)ల కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందించవచ్చు.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. వీవోటీఈఆర్ఎస్.సీఈఐ.జీవోవీ.ఇన్‌లో చేసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఫారాలను దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉంది.

టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు



ఎన్నికలకు సంబంధించి సమాచారం, సహాయం పొందాలనుకునేవారి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ని ఏర్పాటు చేశాం. జిల్లాలో అర్హులైన వారంతా కొత్త ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి. ఓటరు జాబితా సవరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

- మనజీర్ జిలానీ శామూన్ జిల్లా కలెక్టర్, నంద్యాల

ఆరోగ్యశ్రీతో మళ్లీ బతికా




మాది చాలా పేద కుటుంబం. సొంత పొలం కూడా లేదు. రెక్కల కష్టం మీదనే కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. నా భార్య వెంకటసుబ్బమ్మ కూడా రోజూ కూలీకి వెళ్తుంది. గత ఏడాది ఆగస్టు నెలలో నాకు గుండెల్లో నొప్పి వచ్చింది. మా గ్రామంలోనే ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్‌ను వద్దకు వెళ్లాను. పరీక్షలు చేసి గుండె ఆపరేషన్ చేయాలన్నారు. మొదట ఆరోగ్య శ్రీ కార్డు లేకపోతే సుమారు రూ. 4 లక్షల వరకు ఖర్చులు వస్తాయని వైద్యులు చెప్పారు. అయితే వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కార్డు ఉండటంతో ధైర్యంగా కర్నూలు నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో 2022 సెప్టెంబర్ నెలలో గుండెకు ఆపరేషన్ చేయించుకున్నాను. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా చేయడంతో ఒక్క రూపాయ కూడా ఖర్చు కాలేదు. అంతా ప్రభుత్వమే భరించింది. అనంతరం కోలుకునే వరకు రూ. 9 వేలు జీవనోపాధి కోసం అందజేసింది. మూడు నెలలకు సరపడ మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ఆరోగ్య శ్రీ లేకపోతే ఆపరేషన్‌కు కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగా వుంది. పునర్జన్మ ప్రసాదించిన వైఎస్ జగనన్నకు మా కుటుంబం రుణపడి ఉంటుంది.

- నక్కా వెంకటేశ్వర్లు, ఉయ్యాలవాడ



విద్యా దీవెన మాకు వరం



మా తల్లిదండ్రులు వ్యవసాయమే ఆధారంగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. నన్ను బాగా చదివించి మంచి ఉద్యోగస్తుడిని చేయాలన్నది వారి కల. సున్నిపెంట జీఎంఆర్ కాలేజీలో పాలిటెక్నిక్ పూర్తి చేశాను. ఆతర్వాత అప్పులు చేసిమరి బీటెక్‌లో చేర్పాంచాలని అనుకున్నారు. ఏది ఏమైన కడపలోని కేఎస్ఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ బీటెక్‌లో ట్రిపుల్‌ఈలో సీటు వచ్చింది. 2019 నుంచి 2022 వరకు అక్కడే చదివాను. ఆ సమయంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన విద్యా దీవెన పథకం నాకు వరంలా మారింది. ఎటువంటి ఫీజులు కట్టకుండానే బీటెక్ పూర్తి చేశా. ఇప్పుడు హైదారాబాద్‌లో హైటెక్ సిటీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నాను. నెలకు రూ.40 వేలు వేతనం వస్తుంది. విద్యా దీవెన కింద సీఎం సహాయం చేయడంతోనే చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం సంపాదించా. ఇప్పుడు మా కుటుంబ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. మానాన్నా అమ్మవాళ్లు చాలా ఆనందంగా ఉన్నారు. ముఖ్యమంత్రి జగనన్నకు థ్యాంక్స్.

- గుండి నాగన్న, సాఫ్ట్‌వేర్ డెవలపర్, మునలిమడుగు, కొత్తపల్లి మండలం


ఆళ్లగడ్డ: కాచింతల క్షేత్రంలో దీపారాధన


కర్నూలు: కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు


కర్నూలు: దేవనగర్ శివాలయంలో..


నంద్యాల: ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


గడివేముల: భోగేశ్వర స్వామికి క్షీరాభిషేకం


హొళగుంద: సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం


దోన్: రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం


నంద్యాల: చంద్రశేఖరస్వామికి అభిషేకం


కర్నూలు: సప్తగిరినగర్ శివాలయంలో పూజలు

'ప్రణవ' పావనం

కార్తీక మాసం మూడో సోమవారం.. శైవక్షేత్రాలు ప్రణవ నాదంతో ప్రతిధ్వనించాయి. పంచాక్షరి మంత్రంతో మార్మోగాయి. లింగాకారుడు.. సర్వ శుభంకరుడు అయిన పరమేశ్వరున్ని వేడుకోవడానికి భక్తులు వేలాదిగా శైవాలయాలకు తరలివచ్చారు. ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దీపకాంతులతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రముఖ ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. కార్తీక ఉత్సవాలను పురస్కరించుకుని పలుచోట్ల అంగరంగ వైభవంగా గ్రామోత్సవాలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తుల సౌకర్యార్థం దాతలు అన్నదానం చేశారు. – సాక్షినెట్‌వర్క్


ఆళ్లగడ్డ: అహోబిలంలో స్వామికి అభిషేకం


దేవనకొండ: శివుని ఆకారంలో దీపాలను వెలిగించిన మహిళలు


కర్నూలు: భక్తిశ్రద్ధలతో దీపారాధన చేస్తున్న మహిళ


శ్రీశైలం టెంపుల్: కార్తీకదీపాన్ని వెలిగిస్తున్న భక్తులు


గడివేముల: భోగేశ్వరున్ని దర్శించుకునేందుకు..


శ్రీశైలం టెంపుల్: భక్తులతో కిక్కిరిసిన క్యూ


బనగానపల్లె రూరల్: యాగంటిలో ప్రధాన ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పోస్టాఫీసులో దొంగలు పడ్డారు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌కే పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న పోస్టాఫీసులో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. గుర్తు తెలియని దుండగులు పోస్టాఫీస్ తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ట్రెజరీ రూంలోని మనీ చెస్ట్‌లో భద్రపరిచిన రూ.2.88 లక్షల నగదును అపహరించారు. సోమవారం ఉదయం సిబ్బంది విధులకు రాగా తాళం పగలగొట్టి ఉండటంతో లోనికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. సబ్ పోస్ట్‌మాస్టర్ గురువయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చాగలమర్రిలో చైన్‌స్నాచింగ్

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని పాత ఎస్సీ కాలనీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున చైన్‌స్నాచింగ్ జరిగింది. స్థానిక శ్రీనివాస నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పి.లక్ష్మీదేవి భర్త రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటసుబ్బయ్యతో కలిసి కార్తీకమాస పూజలకు శివాలయానికి బయలుదేరారు. చక్రపాణి థియేటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లక్ష్మీదేవి మెడలో ఉన్న రూ.1.20 లక్షల విలువైన రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని చుట్టుపక్కల గాలించినా చైన్‌స్నాచర్ ఆచూకీ లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

బొమ్మలసత్రం: కర్నూలు పట్టణానికి చెందిన విజయ్ అనే వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.1.50 లక్షలు తీసుకుని ఉద్యోగము ఇప్పించకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని నంద్యాలకు చెందిన ప్రదీప్ అనే వ్యక్తి స్పందనలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాది చేశాడు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. అలాగే స్పందనలో ఒకసారి వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. త్వరితగతిన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తంగా 90 ఫిర్యాదులు అందాయని వాటిని చట్ట పరిదిలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, నంద్యాల తాలూక సీఐ దస్తగిరి బాబు, సీఐ సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ప్రేమ పేరుతో మోసం

కోవెలకుంట్ల: ప్రేమ పేరుతో ఓ యువతిని మోసం చేసి మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించిన యువకుడిపై సోమవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. అవుకు మండలం సంగపట్నం గ్రామానికి చెందిన వలి కోవెలకుంట్ల పట్టణంలో ఓ షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఇదే షాపులో పనిచేస్తున్న పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఎస్టీ కులానికి చెందిన స్పందనతో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే వలి ప్రేమించిన యువతితో కాకుండా మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు యత్నించగా ఆ వివాహాన్ని అడ్డుకుని బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది. విచారణ జరిపిన పోలీసులు వలిపై చీటింగ్, ఎస్సీ, ఎస్టీ కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కర్నూలు: నగరంలోని ధర్మపేటకు చెందిన గోవిందు (36) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ నెల 2వ తేదీన అదే కాలనీకి చెందిన స్నేహితుడు చనిపోవడంతో సుంకేసుల రోడ్డులోని శ్మశాన వాటికకు అంత్యక్రియలకు వెళ్లాడు. తిరిగి రాలేదు. సోమవారం ఉదయం శ్మశాన వాటిక దగ్గర ఉన్న మట్టికుప్పల మధ్య శవమై కనిపించాడు. ఈయన గొండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 నుంచి మిషన్ ఇంద్ర ధనస్సు


రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన నగరంలోని ఇల్లూరు నగర్‌లో ఉన్న యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలు ఏదైనా కారణం వల్ల ఇవ్వనట్లయితే డ్యూ లిస్ట్ తయారు చేసుకుని వారికి మూడవ విడతలో భాగంగా 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించాలన్నారు. ఆ వివరాలను యువిన్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. న్యుమోనియా లక్షణాలున్న పిల్లలను పరిశీలించి వారికి మెరుగైన వైద్యం కోసం సమీపంలోని సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించాలని సూచించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ నివేదిక సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): కరువు మండలాల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు అవసరమైన నివేదికను జిల్లా వ్యవసాయ యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లాలో 26 మండలాలు ఉండగా తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలు మినహా మిగిలిన 24 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కరువు మండలాల్లో ప్రతి రైతుకు 2 హెక్టార్ల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించనుంది. కరువు రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాలను సవరించింది. వ్యవసాయ పంటలకు సంబంధించి 2,90,741 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ లభించనుంది. ఈ రైతులకు సంబంధించి 2,38,231.42 హెక్టార్లకు రూ.368,36,27,080 ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేలా వ్యవసాయ యంత్రాంగం నివేదిక సిద్ధం చేసింది. నివేదికను కలెక్టర్ సృజ న ద్వారా ప్రభుత్వానికి పంపుతున్నట్లుగా జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ నివేదిక తయారీ మంగళవారం ఉదయానికి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

కేసీలో వ్యక్తి గల్లంతు

కర్నూలు: నగరంలోని ధర్మపేటకు చెందిన గొండా పాల్ (46) కేసీ కెనాల్‌లో గల్లంతయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ధర్మపేటకు చెందిన శిరీష కెనాల్ ఒడ్డున బట్టలు ఉతుకుతూ ప్రమాదవశాత్తు జారి కాలువలో పడింది. అక్కడే ఉన్న పాల్‌తో పాటు మరికొందరు కలసి ఆమెను బయటకు తీసి కాపాడారు. అయితే పాల్ నీటిలో మునిగి కనిపించకపోవడంతో అక్కడున్న యువకులు చాలాసేపు గాలించినా కనిపించలేదు. ఈయన గొండా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. విషయం తెలిసిన వెంటనే రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. బంధువులు కూడా కేసీ కెనాల్ వెంట గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు మెడికల్ షాపులు సీజ్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు జరుపుతున్న ఐదు మెడికల్ షాపులను సోమవారం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ గత నెల 15న పట్టణంలోని పలు మెడికల్ షాపులపై దాడులు నిర్వహించామన్నారు. శ్రీనివాస సెంటర్‌లోని అపోలో మెడికల్ షాపు, ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న అపోలో మెడికల్ షాపు, గాంధీ చౌక్ లోని ఆంధ్ర మెడికల్స్, బిస్మిల్లా మెడికల్స్, కాత్యాయని షాపుల్లో ఔషధ నియంత్రణ అధికారుల సమక్షంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 5 మెడికల్ షాపులకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకుని పరిశీలించామన్నారు. మందుల విక్రయాల్లో ప్రభుత్వ నిభంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపినట్లు తేలడంతో ఆ ఐదు మెడికల్ షాపులను సీజ్ చేశామన్నారు. సీఐ సునీల్ కుమార్‌తో పాటు, సీఐ కేశవ రెడ్డి, ఔషధ నియంత్రణాధికారి ఖలందర్ పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి బంగారు గాజుల విరాళం



కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామికి సోమవారం కర్నూలు నగరానికి చెందిన చక్రపాణి, అతని కుటుంబ సభ్యులు 39.4 గ్రాముల బంగారు గాజులను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, ట్రస్టుబోర్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం


దాతలకు జ్ఞాపికను అందజేస్తున్న ఏఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం ఒంగోలుకు చెందిన అపూర్వ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఆర్ సురేష్ రూ.1,00,500, బెంగళూరుకు చెందిన అక్షిత్, పి.అశోక్ రూ.1,00,500 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని ఏఈఓ ఎం.ఫణిధర ప్రసాద్‌కు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

మహానందీశ్వరుడికి వెండి రుద్రాక్ష మండపం


వెండి రుద్రాక్ష మండపాన్ని తీసుకొస్తున్న దాతలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీమహానందీశ్వర స్వామివారికి నంద్యాలకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ మారం వెంకట సుబ్బయ్య, కటుంబసభ్యులు రూ.25 లక్షలు వెచ్చించి 35 కిలోల వెండితో రుద్రాక్ష మండపం చేయించారు. ఈ మేరకు దాతలు సోమవారం రాత్రి మహానందికి చేరుకుని ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో వెండి మండపాన్ని అందించారు. వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికి ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అలంకరించారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రసాదాలు అందించి సత్కరించారు.

లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేయాలి

కర్నూలు(లీగల్): వైఎస్ఆర్‌సీపీ లీగల్‌సెల్‌ను మరింత బలోపేతం చేయాలని కర్నూలు, అన్నమయ్య జిల్లాల జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్, స్టేట్ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ షాషావలి అన్నారు. ఈనెల 10వ తేదీన కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సమావేశం జరుగనుంది. ఈ కార్యక్రమం నిర్వహణపై సోమవారం స్థానిక జిల్లా లీగల్ సెల్ కార్యాలయంలో అధ్యక్షుడు పి.సువర్ణారెడ్డి అధ్యక్షతన సమావేశమై చర్చించారు. జోనల్ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ జిల్లా లీగల్ సెల్ సభ్యులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టం ద్వారా రైతులకు ఎలాంటి నష్టం ఉండదని సువర్ణారెడ్డి అన్నారు. అనంతరం బండారి ఈరన్న నాయకత్వంలో సుమారు 20 మంది న్యాయవాదులు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌లో చేరారు.


వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌లో చేరిన న్యాయవాదులు